



# స్వ(ర్ణ)ప్నలోకంలో వా(సు)స్తవం!

రచన: బొడ్డపాటి సూర్యనారాయణమూర్తి

శ్రీయుత వాసుదేవరావు నామధేయం మీకు అపరిచితం కాదనుకుంటాను ; ఐతే కాలానికివున్న అపూర్వమైన శక్తివల్ల సుపరిచితులనే కొండొకచో మరిచిపోడంకద్దు. మరుపులో కూడ చాలా రకాలున్నవి. పూర్వాశ్రమంలో నా స్నేహితు డొకడిపేరు — 'వీర వెంకటసత్య .... రాజా పూర్వదేశయాత్ర — వీరేశలింగం....' అని భాషలోగల యాభై అరు అక్షరాలకు అతీతంగా పోయి, ఉచ్చారణ యోగ్యంకాక, వివిధ సామాన్య నామధేయాలకు ఏకత్వం సిద్ధింపజేసి—ఆఏకత్వం లోనే భిన్నత్వం కలుగటంజేసి, పూర్తిగా పిలవడమో, విడివిడిగా పిలవడమో తెలియని విచికిత్సలోపడి, చివరికాపేరుమీద, ఆ మనిషిమీద అసహ్యంకలిగి మరిచిపోడానికి ప్రయత్నించి, ప్రయత్నం సాధ్యం కాకపోగా అప్రయత్నంగానైనా మరిచిపోతుంటాం. ఇక్కడ అలా జరిగేందుకు వీలులేదు ; ఎంచాతంటే మావాడిపేరు ముద్దుగ రెండే రెండు అక్షరాలు ' వాసు ! ' అని.

అయితే, మీ సందేహం నాకు తెలుసు. చరిత్రలో మావాడు ఆక్రమించిన ప్రముఖ స్థానం ఏమిటని....ఆ విషయం ఇదమిద్ధమని నేనూ వివరించలేకపోయినా, గాంధీ వీరేశలింగం, రాజారాంమోహన్‌రాయ్....ల వంటి సంఘ సంస్కర్తల కోవకి చెందుతాడేమో ననుకుంటాను. కేవలం అనుకోడం మాత్రమే! ఎంచాతంటే సంఘ సంస్కరణంటే అది ఒక రకం జంతువో, జాడ్యమో అనుకునేంత అమాయకుణ్ణి నేను....!!!

శ్రీయుత వాసుదేవరావుకి స్త్రీల విషయంలో మరేం దురభిప్రాయపడకుందురుగాక—కాలేజీ రోజుల్లో అధ్యక్షుని గుండెలదిరిపోయేట్టుగ—బల్లగుద్దుతూ మైకా రాక్షసుడు ఎరువుతెచ్చికొన్న గొంతుకతో, మానినీసమాజంవైపు—నాతి తీక్షణంగా, కొంతవడి ముక్కంట — ఒకింతసేపు క్రీగంటచూస్తూ వివిధ వర్ణ సమ్మేళనానికి వీలుగా వివాహాలు జరుపబడాలనీ .... విధవా వివాహాలు చెయ్యాలనీ ...., బాల్యవివాహాలు నశించాలనీ .... స్త్రీ హృదయాన్ని, ప్రేమనీ వివాహవిషయంలో గమనించాలనీ, వాళ్ల అభివృద్ధే దేశాభివృద్ధి అనీ (ఈవిషయంలో నాకేం భేదాభిప్రాయంలేదు—స్త్రీలే సృష్టి కర్తలన్నది నిర్వివాదాశంకదా!) ఓపినంతసేపు అరిచేవాడు !!

అబలలందరకు మావాడు ఆదర్శదైవం అయితే....అతని మానసికభావాలదృష్టిలో—ఈ అబలలు — ఆరాధ్యదేవతలు కాకున్నా కాకుందురుగాక, తరుణులదరహాసం వీక్షించగల తరుణం ఎప్పుడాని ఎదురుచూసే నాబోటి ధీరులు—ఆ వనితారత్నాలే ఈ వాసుదేవరావు వికసితవదనం వీక్షించినంతమాత్రాన జన్మపావనం అవుతుందని భావించే దుర్దినాల్లో సంఘసంస్కరణకి అర్థం — మానవాకృతిలోనున్న మా వాసుదేవరావుకాక తద్భిన్నమైన వింత వస్తువు ఇంకొకటి ఉండగలదని ఎలా అనుకోగలరు!!

సారాంశం, వాసు సంస్కారి....!

వాడికీ మధ్య పెళ్లి అయిందట!!

ఇక వెండితెరమీద కథాప్రారంభం అవుతుంది....నాందీప్రస్తావన అయిపోయింది!!

* * *

ఉద్యోగ ధర్మాన్ననుసరించి, హిందూదేశానికి అట్టడుగునవున్న లంకమొదలు – హిమాలయపర్వతాలవరకూ గల మధ్యప్రదేశమంతా సంచరించినవాడనై, ఒకసారి ఏనాడో శాస్త్రవేత్తలు భూమి గుండ్రంగావున్నదన్నసత్యాన్ని నిరూపించిన అనంతరం ఆ విషయాన్నే రెండవసారి అవివేకంగా నిరూపిస్తూ, బయల్దేరిన స్థలానికే, వచ్చి చేరుకొన్నాను!!—

ఊరు అన్నపేరు మనకు పాతదైనా ఆ వూరూ, అక్కడి వ్యక్తులూ, అంతా కొత్తగానే అగుపిస్తారు. కొత్తగావచ్చిన పాతవాళ్లకి చిన్నప్పటి మిత్రబృందం యావత్తూ, ఈ రాకెట్ యుగంలో రెక్కలొచ్చాయో ఏమో! విగ్రహాంతరాలకో ఎగిరిపోయినట్టుంది!! మా వూళ్ళో నే నెరిగిన, అక్కడేవున్నవాడువాసుమాత్రమే! కానీ వాణ్ణి పట్టుకోడం కష్టం....వాడు సర్వాంతర్యామి....మొగుడొదిలేసిన శనగలదుకాణం చిన్నమ్మ సమస్య మొదలుకొని — జిల్లాజడ్జి జీవన్మృతరావు మొదటిపెళ్లాం ప్రమోషన్‌తో పాటు పెరిగిన భర్తృజీతంలో ప్రపోర్షనేట్‌గా తనకు రావాల్సిన 'కంపెన్‌సేషన్'కూడా పెరగాలని పెట్టిన పిటిషన్‌పై జడ్జీగారికి ఉత్పన్నమైన సమస్యవరకూ సర్వదా మొలబంటి లోతులోతు మునిగి, అగోచరుడైన వాణ్ణెలా పట్టుకోడం ?

ఆఫీసు అయిపోయిన తర్వాత క్లబ్బుకి వెళ్ళాను. పరిచితులెవరూలేకపోయినా, అపరిచితుల మధ్యయినా, పరిచయం కల్పింపగల వాతావరణం అక్కడుండబట్టే, అంతా అక్కడికి వెడతారు!!

పోర్టికోలో జిల్లా జడ్జీగారి కారు ఆగడమూ, అందుండి శ్రీయుత వాసుదేవరావుగారు మరణించిన విక్రమార్కుడి రీవితో, జడ్జీగారు అంగరక్షకులై రాగా, సతీసమేతుడై, క్లబ్ ఆవరణను బూటుధూళి(పాదధూళిప్రయోగం అనౌచిత్యం....పాదాల్ని బూట్లు దాచేశాయి కాబట్టి)తో పవిత్రంచేస్తు ప్రవేశించాడు !!

నేను హఠాత్తుగా ఆనందంతో బాటు తగిన ముఖారవిందంతో, ప్లేయింగ్‌కార్డ్సు విసిరి — నే చేసిన దుష్కృత్యానికి నా పాట్నర్స్‌కళ్లలో ఎర్రగా వెలిగిన కోపాధిక్యతాశాతాన్ని గమనించినవాడనై, అవనతముఖుడనై, అర్డరిచ్చిన అరంజ్‌క్రష్‌లు అందరికీ పట్టి, శాంతపరచి, మిత్రుని జీరంజీరి ఆకస్మాత్తుగ కౌగలించుకొన్నాను.

వాసుగాడు బహు ఉద్రేకి ఆడవాళ్లవిష యంలో — నిజమే — ఇంత అభిమానంగా వచ్చిననన్ను సీరియస్‌గా చూస్తు ఈలెన్‌సూట్ మడతలూ, టంచనుగా బిగించిన'టై' ఎక్కడ నలిగిపోతాయో నని బాధపడుతూ, లేవ నెత్తాడు....!

'చాలా రోజులకి కలిశాంరా' అన్నాడు కంఠంలో ప్రేమాభిమానాలు ధ్వనింపచెయ్యా డానికి ప్రయత్నిస్తు కోపంగా 'ఇదుగో....ఈమె నా సతీమణి....మాట్లాడుతూవుండు ; ఇప్పుడే వస్తా' అని గబగబ నాలుగు ముక్కలనేసి, జడ్జీగారితో లోపలి కెళిపోయాడు కారల్టన్ పిలుస్తూ.

అప్పటికిగానీ ఆయనగారి సతీమణిని చూడలేదు! ఆశ్చర్యపోయాను! ఎక్కడోచూసి నట్టు గుర్తు—? గతం మెదడులో గిర్రున తిరిగింది. ఆఁ....పట్టేశాను — చిన్నప్పుడు మామిడిచెట్లక్రింద అందని కాయలందుకొనే యత్నంలో ఎగురుతూ విఫలంకాగా .... దగ్గ రున్న నన్ను బ్రతిమాలుకొని, తీరా నేను చెట్టెక్కి దులిపి శ్రమపడితే, ఒక్కకాయైనా నాకీయకుండా నే చెట్టుదిగేలోగానే పారి పోయి నన్ను అల్లరిపెట్టే చిన్ననాటికలల్లోని కథానాయిక ఎదురుగావున్న కాంతారత్నంలో తళుక్కుమన్నది! సంతోషాశ్చర్యాల్తో, రెండు భుజాలూ పట్టుకొని, ఎదురుగావున్న కుర్చీలో కూలవేశాను....స్వర్ణ ఉక్కిరిబిక్కిరై చుట్టు ప్రక్కల చూడసాగింది, లజ్జతో, అనుమాన ముతో. ఆమే మిసెస్ స్వర్ణలతావాసుదేవ్రావ్!

'మరిచిపోయావా స్వర్ణా! నన్ను....చిన్న ప్పుడు ఎంత ఏడిపించేదానివినన్ను' అన్నాను ఉద్రేకంగా ఆమె భుజాలు ఊపి వాస్తవ ప్రపంచంలోకి తీసికొస్తూ.

'ఊఁ....మెల్లిగా మాటాడండి!'

'చిన్నప్పుడు నువ్వెంత గట్టిగా అరిచి అల్లరిచేసేదానివో....?'

ఆమె ముఖంలో గులాబీలు పూశాయి. సిగ్గుతో శిరస్సు వంచుకొన్నది.

'అమ్మా, నాన్నా కులాసావా?'

'ఆఁ....అంతా సుఖంగా వున్నారు—'

'ఊఁ మరేమిటి కబుర్లు ? ఎన్నాళ్లయింది పెళ్లయి? కుమా(రీ)ర సంభవమేమన్నా....'

'చాల్లెద్దూ....' అంది కోపం, సిగ్గూ ఒక దాన్నొకటి తరుముకురాగా 'ఇంకా సంవత్సరం కాలేదు పెళ్లయి—!'

'ఎలాగుంది మీ సంసారం?'

స్వర్ణ ముఖకవళికలు మారిపోయాయి. విచారమేఘాలు ఆలముకొన్నా యామెను. ఒకటి రెండు బాష్పకణాలామె కళ్లలో మెరి శాయి! సానుభూతి వాక్యాలు అంతర్గతవిచా రాన్ని బహిర్గతంచేస్తాయి కాబోలు ?



'ఆయనతో వేగడం చాలా కష్టంగా వున్నది మామా – నాన్న మేం ఓదగ్గర పడివుందాం అంటే వీల్లేదు. అందరితోనూ అర్థం లేని స్నేహాలు, తిరుగుళ్లు తనమట్టుకు తనుతిన్నా ఎలావున్నా ఫర్వాలేదట. కానీప్రపంచదృష్టిలో మాత్రం ఇటువంటివాడు లేడు అనిపించు కోవాలి! జడ్జీలు, డాక్టర్లు వాళ్లభార్యలు .... వీరితో తీతగలేక ఛస్తున్నాను....క్షణం తీరిక లేదు. ఇంట్లో వంటాపెంటా లేదు....హోటలు భోజనం పడ్డంలేదు....'

'మరి సంఘ సంస్కర్తకదా....'

'..............................'

'ఏదోలా సర్దుకుపోవాలి .... అన్నట్టు నీ కాలేజీమార్కు ఉపాసకుడు నెం 1 మధు సూదనరావు వార్తలేమిటి?'

స్వర్ణవిషాదమూర్తిఅయింది. ఈ విషయం గుర్తుకి తేవడం తప్పే అనుకున్నాను....స్వర్ణ కాలేజీ రోజుల్లో మధుసూదనాన్ని ప్రేమించి, పెళ్లాడాలని కలలుకనేది; ఏదో కొంత కట్న ముతో పెళ్లి నిశ్చయం అయిన సమయంలో, తాను కానీ కట్నం పుచ్చుకోకుండా పెళ్లాడతా నని తయారయాడు వాసు.' దానితో, కథ అడ్డంతిరిగింది. తల్లిదండ్రులుబలవంతంమీద స్వర్ణ వాసు అర్ధాంగిరత్నం అయిపోయింది! ఆమె హృదయాన్ని ముల్లుతో కెలికినందుకు బాధపడ్డాను. 'క్షమించు' అన్నాను ఆమె చేతులు పట్టుకుని.

ఇంతలో వాసు హడావిడిగా వచ్చాడు! 'రా బ్రదర్ ఇంటికి పోదాం! లే స్వర్ణా!— ఇవాళ జడ్జీగారూ, సూర్యం మనకి అతిథులు' అన్నాడు కారు తలుపుతెరుస్తూ.

'హరిన్నీ .... హొటల్ కారియర్‌తో నట్రా నీ అతిధ్యం....' అన్నాను పరిహాసంగా.

'లేదురా...ఇవాళ మా శ్రీమతి స్వహస్త పాకం చవిచూసెదరుగాక!' అన్నాడు నవ్వుతూ అభినయపూర్వకంగా.

* * *

కొన్నిరోజులు దొర్లిపోయాయి. ఈ కొద్ది రోజుల్లోనే స్వర్ణ ముసలితల్లి స్వర్గయాత్రకు ప్రయాణం కట్టుకుంది. స్వర్ణ విచారానికి అంతులేదు. వాసూ, నేనూ ఆమెను తిరిగి మనిషిగా చెయ్యడానికి చెయ్యనిప్రయత్నాలు లేవు. నేను నెల శెలవుపెట్టాను. కానీ వాసు మాత్రం తన అమూల్యమైన సంఘసేవకు లోటు వాటిల్లుతున్నదని విసుక్కున్నాడు. స్వర్ణకి వాడిమీద మహాకోపంగా వుంది!!

ఉన్నట్టుండి ఒకరోజున వాసులేని సమయాన నన్ను రమ్మని కబురంపింది స్వర్ణ వెళ్ళాను.

స్వర్ణ చాలా చిక్కిపోయింది. అమెలో సౌందర్యం—హంపీ శిధిలాల్లాగా — మండు వేసవికి ఎండిపోయిన కాసారంలాగ కన్పించింది! నా మనస్సు ఆమెపట్ల జాలితో ద్రవీభూతమై పోయింది!!

స్వర్ణ కూచోమని కుర్చీ చూపింది. పొగలు కక్కుతున్న కాఫీతెచ్చి, ఓకప్పు నాకిచ్చి, తానుకూడా ఒకటి పుచ్చుకొని, నా కెదురుగ కూర్చున్నది.

'ఏమిటిలాగైపోయావు?' అన్నాను అనాలోచితంగా ఆమె గాయం తిరిగి రేపుతూ.

'నాకి జీవితంమీద చాలా అయిష్టంగానూ, విరక్తిగానూ వుంది.'

అదిరిపడ్డాను నేను; అయోమయంగా అడిగాను 'ఏం?' అని.

ఆ విషాదవిగ్రహం కొద్దిగా వణికినట్టు కన్పించింది. ఆమెకళ్లలో బాష్పముత్యాలు మెరిశాయి! నేను ప్రక్కనుంచిన రుమాలుతో కళ్లు తుడుచుకొంటూ అంది.

'నాకు వాసుతో జీవితం దుర్భరంగావుంది' తిరిగి ప్రశ్నించలేదు ఏం అని. అలా ప్రశ్నించడం ఆమెను బాధించడమే కావచ్చు. నేను అడిగితేనేగాని చెప్పకుండావుండగల సహనం ఆమెలోలేదు! ఎంచాతంటే ఆమే నన్ను రమ్మన్నది. రమ్మన్నవ్యక్తి విషయాలు గుంభనంగా దాచుకోగలదా?

'వాసు సాధారణ మానవుడు కాదు; పేరు ప్రతిష్టలకోసం—సర్వస్వాన్నీ, చివరకు నన్నుకూడా త్యజించగల స్వార్ధత్యాగి! ఇంట్లోవంట పెంటల్లేవు; నేను వంట చెయ్యరాదట? ఆ హొటలుభోజనం పడకుండావుంది నాకు. నాతో ఒక్కక్షణం ప్రేమపూర్వకంగా మాటాడ్డానికాయనకు తీరిక వుండదు. ఎంతసేపూ ఆఫీసర్లూ, వాళ్లభార్యలూ, వాళ్లతో తిరుగుళ్ళూ నా విషయం అతనికి అక్కరలేదు. అలాగని నా మానాన నన్నుండనియ్యరు–నానా రకాల వాళ్ళతో భుజం భుజం రాసుకు తిరగాలి! అతనికళ్లలో ఒకోసారి నా మీ దనుమానం.... ఎందుకొచ్చిన ఈ నటనలూ, నాజూకులూ నాకుమాత్రం ప్రాణాంతకంగా వుంది!'

వింటున్నాను; ఆమె ప్రారంభించింది.

'మొన్న అమ్మపోయినపుడు నెలరోజులు సెలవుపెట్టి, నాగురించి బాధపడ్డావు. కానీ ఆయన చీమకుట్టినంతైనా బాధపడలేదు! నాయందు అణుమాత్రం అభిమానంలేని వ్యక్తితో ఏం సంసారం చెయ్యడం?' అంది నాచేతిలో కాఫీకప్పుని అందుకుని టేబిల్‌మీద పెడుతూ.

'మావూర్లో రెండిళ్ళూ, కొంతభూమీ ఇంకా మిగిలిఉంది. అమ్మ చనిపోయింది — ఇంకెవరూ అక్కడలేదు కాబట్టి, వాటిని అమ్మేసి, ఆ సొమ్ము 'మానవాభ్యుదయ సంఘం' కి విరాళం యిచ్చెయ్యమని బలవంతం చేస్తున్నారు!'

నేను ఆశ్చర్యపోయి అడిగాను 'ఓరి వీడసాధ్యంకూల! అస్తి ఎంత కిమ్మత్తేవిఁటి?'

'దాదాపు 25 వేలు....!'

'ఇంత సొమ్ము విరాళమే! ఎంత త్యాగబుద్ధి!'

'ఆ డబ్బు ఎటూపోదు' నవ్వింది స్వర్ణ, 'ఆసంఘానికి మూలస్తంభం ఆయనే! ఎటొచ్చీ నా పేరనున్న ఆస్తి ఆయనపేర మారుతుంది! అంతే .... అయనకు బ్రహ్మాండమైన పేరు ప్రతిష్ఠలొస్తాయి!'

కాసేపు ఆమెమౌనం. నేనూ ఏమీ మాటాడలేదు. చటుక్కున ఆమె ధోరణి మారిపోయింది. 'మధు ఈ వూళ్ళోనే వున్నాడు' అంది.

నేను విస్మితుణ్ణయి అడిగా. 'ఇక్కడేం చేస్తున్నాడు!'

'ఈమధ్య ఐ. ఏ. ఎఫ్. పాసయ్యాడు' ఇక్కడకు కలక్టర్‌గా వచ్చాడు!'

స్వగతంగా అదృష్టవంతుడు అనుకోబోయి అదే అనేశాను బైటికి.

'నేను వాసుకి విడాకులిచ్చేస్తున్నాను'

'మధు నీతో అప్పుడే ప్రేమాయణం ప్రారంభించాడా?' అన్నాను హాస్యధోరణిలో—

ఆమె మౌనం;

'వాసుది గొప్ప హృదయం; విశాలభావాలు స్త్రీలవిషయంలో ప్రాణంకూడా పణం పెడతాడు. నీవు నీ ప్రేమవిషయం వాడిగ్గానీ చెబితే, తనచేతుల్తో, తనే సాక్షిగా మీపెళ్లి జరిపిస్తాడు!'

'ఎప్పటి విషయం ఇది?'

'కాలేజీ రోజుల్లో—'

'నవ్వింది స్వర్ణ! నా ప్రేమవిషయంలో తనకు అంతులేని సానుభూతి వుందట అయితే దీనికి మట్టుకు అంగీకరించడట! విడాకులియ్యడం–తన ఆహానికీ, సంఘంలో తన గౌరవప్రతిష్ఠలకీ దెబ్బట!'

'ఔరా! ఎటువంటివాడు ఎలా మారిపోయాడు' అనుకున్నా మనసులో మెల్లిగా.

బైట అలుకుడయింది.

వాసు గొంతు వినిపిస్తోంది!

'పాపం! భర్త చనిపోతేనేంగాక! ఇంకా చిన్నపిల్ల....పట్టుమని 15, 16 ఏళ్లుంటాయో వుండవో! అనుభవించాల్సినదంతా ముందే వుంది....నిరభ్యంతరంగా రెండోపెళ్లిచేద్దాం.... మరేం సంశయించకండి .... అసలు భర్త వున్నాసరే, ఆమె కిష్టంలేకపోతే, రెండో పెళ్ళి ఆమె చేసికుందికి అవకాశం కల్పింపబడాలి!'

నేను లేచాను; స్వర్ణదగ్గర శలవుతీసికొన్నాను. తర్వాత కొన్నాళ్లకు వాసుతో ఈ విషయం మాటాడి అతని కోపానికి గురైనాను. ఇఁక స్వర్ణకికూడా ఏ సలహా యియ్యలేదు; అల్లా కనీసం యిస్తే, అది వాసులాటి ప్రాణ

మిత్రుడికి ద్రోహం చేయడమే కావచ్చు! అంచాత వాళ్ళిద్దరికీ సాధ్యమైనంతదూరంగా తిరగడం ప్రారంభించాను.

★ ★ ★

ఒకరోజు వాసు, అకస్మాత్తుగా నన్ను తెవులు పట్టిన మనిషిలా రోజుకుంటూవచ్చి కలిశాడు. వాణ్ణి కూచోబెట్టి 'ఏరా!' అన్నాను.

'కన్పించడం మానేశావు! కోపమా?'

'కోపమెందుకు భాయీ, తీరఌలేదు!'

కొంతసేపు నిశ్శబ్దం రాజ్యంచేసింది. గోడ పటాలమీంచి దృష్టితిప్పకుని అన్నాడు 'స్వర్ణ విడాకులు కోరుతోంది; రెండోపెళ్లిచేసికొంటుం దేమో?'

'సంస్కర్తవిగా' అన్నాను పరాగ్గా 'మీ కుటుంబానికింకేం పనివుంది....శ్రీమతిగారితో కలిసి, ఆ పెళ్లేదో జరిపించెయ్!'

'ఏ లోకంలో వున్నావ్‌రా!' అన్నాడు నా భుజాలుపట్టివూపుతూ. 'నా శ్రీమతి స్వర్ణరా! నానుంచి విడాకులు కోరుతున్నది....'

'నిజమా! కలా??'

'నిజం....నూటికి నూరుపాళ్ళూను—'

'తనెవర్నో చదువుకొనే రోజుల్లో ప్రేమించిందట-కానీ తల్లిదండ్రుల్ని గాయపరచడం యిష్టంలేక—ఇన్నాళ్ళూ కలిసివుందిట. వాళ్లీ లోకంలో లేరుగా....ఇక తెగిన గాలిపటంలా ఉన్నపాతికవేలతో ఎటో ఉడాయిద్దామనేమో'

'తప్పేంవుంది!' అన్నాను తాపీగా! పాపం ఎవర్ని ప్రేమించిందో, వాళ్లకిచ్చి, పెళ్ళి చేసెయ్! నీ సంస్కార హృదయం ఏమైంది రా....??' అన్నాను.

వాసు కోపం అణచుకొన్నాడు బహుప్రయత్నంతో...'ఎవణ్ణి ప్రేమించిందో తెలీదు....నీకేమన్నా తెలుసా?'

నిజంచెప్పి, వీద్దరిమధ్యా చిక్కుకోడం నా కిష్టంలేదు. అన్నాను నవ్వుతూ. 'బాగుంది నీ వరస....నీభార్య ఎవర్ని ప్రేమించిందో నాకేం తెలుసు? నాకు తెలిసిన వాళ్లెవరైనా వుంటే అది నువ్వే! నిన్నుమించి నీ భార్య ఇంకెవర్ని ప్రేమిస్తుందిరా?'

★ ★ ★

మా కార్యక్రమం మామూలుగానే సాగిపోతున్నది. డీమీగా కన్పిస్తోంది ప్రపంచం. కొత్తగ కలక్టర్‌గా వచ్చిన మధుసూదనం రోజూ క్లబ్బుకి వస్తున్నాడు. స్నేహన్నదుడు కావడంమూలాన వాసు, స్వర్ణలతోను, నాతోను చనువుగా వుంటున్నాడు. అందులోనూ, అధికారులతో స్నేహం అంటే పడిచచ్చే మావాసు, మధుని క్షణం వదలకుండా తిరుగుతున్నాడు. సతీతిలకంతో కలిసి! నేనూ దినంలో అధిక భాగం క్లబ్‌లోనే గడపుతున్నాను-ఇంటిదగ్గర క్లబ్‌లోకన్నా ఆప్తులెవరూ లేకపోడంవలన.

వాసు రెండురోజులక్రితం డిస్ట్రిక్ట్‌జడ్జీగారితో కలిసి ఎటో క్యాంపు వెళ్ళాడు. ఒంటరిగా ఉండలేక రోజూ క్లబ్‌కే వచ్చేస్తోంది స్వర్ణ. నేనూ, ఆమె,. మధూ కులాసాగా కబుర్లు చెప్పకుంటూ కాలక్షేపం చేసేవాళ్లం. రాత్రి 9, 10 గంటలప్రాంతంలో మధు తన కార్లో ఆమెను ఇంటిదగ్గర దించేవాడు.

ఆరోజు 10 గం. వరకూ ఏదో ఆడుతూ కాలక్షేపం చేశాము వాసు రాలేదు. చివరకు విసుగెత్తి, మధు స్వర్ణలదగ్గిర శలవు తీసికొని, నిద్ర ముంచుకొస్తుండం మూలాన నా కేర్పాటుగదిలో వెళ్లి పడుకున్నాను క్లబ్బులోనే!

నిద్రపట్టడంలేదు. పక్కగదిలో రేడియో మనుషులు మాటాడుతున్నట్టు, నవ్వకుంటు న్నట్టు ధ్వని. హాల్లో చైర్మన్‌గారి చదరంగం మీద ఉపన్యాసం....కుక్కల అరపులు కీచురాళ్ల రొద నిద్రపట్టడంలేదు.

రాత్రి ఒంటిగంటై ఉంటుందనుకుంటా. ఎవరో నన్ను తట్టిలేపుతున్నారు .... కళ్ళు నులుముకుంటూ లేచి చూశాను....వాసు!!!

కంగారుగా అన్నాడు—

"స్వర్ణ యేదీ?"

"ఇక్కడెందు కుంటుందిరా — ఇంటికెళ్లి చూడు!"

"ఇంటికివెళ్లేవస్తున్నా....తాళంవేసివుంది" అప్పటికి గానీ నేను జాగ్రదావస్థకి రాలేకపోయాను. మధు ఆమెను అప్పుడే దిగబెట్టాడే!"

వాసు కంగారుకి మెలకువగాఉన్నవాళ్లంతా వచ్చి చుట్టూచేరారు. హడావిడి, కంగారుల స్థాయి మరికొంచం అధికమయింది. "మధు యింటికి ఫోన్‌చెయ్యరా!" అన్నాను.

ఫోన్‌చేశాడు; మధు యింటిదగ్గర లేడని జవాబు!!—

"అయితే....ఇక్కడే ఎక్కడో వుంటార్రా!"

తక్షణం బైలుదేరాడు వాసు! అతిథుల గురించి క్లబ్‌లో ప్రత్యేకించబడిన గదులు వున్నాయి. వాటిని పరిశీలించడం ప్రారంభించాం యిద్దరమూ....మేలుకొని ఆడుకుంటున్నవాళ్లలో ఎక్కడా లేరు వీళ్లు.

చాలామటుకు గదులన్నీ ఖాళీగా వుంటున్నయ్. ఒకగదిలో నేనూ, మరొక రెండు మూడింటిలో ఇంకెవరో వుంటున్నాం. వాసు ఒక గదిలో తలుపుతట్టి, నిద్రాభంగంచేసిన మూలాన ఏదో సర్ది సమాధానం చెబుతున్నాడు.

హటాత్తుగా నాకు గుర్తు కొచ్చింది — నా ప్రక్కగదిలో రాత్రల్లా ఎవరో అలికిడి! త్వరగ నా గదిదగ్గరికివచ్చి, కిటికీకున్న నీలికర్టెన్ తొలగించిచూశాను. డిమ్‌లైటు వెలుగుతోంది!

ఆ మసగచీకటిలో, గదిలోకి పరిశీలించి చూశాను. లోపల ఉన్నది ఒకటే ఒక్క పెద్ద మంచం....దానిమీద రెండు ఆకృతులు.... స్త్రీ పురుషుల్లా వున్నారు .... ఒకరికౌగిలిలో ఒకరు. తిరుగుతున్నఫేన్, దీపానికి అడ్డమై, చీకటిని చిమ్ముతోంది! వాళ్ళిద్దరూ మధు స్వర్ణలు కారుగదా? నేను శిలనైపోయాను.

మరుక్షణంలో వాసు నా పక్క నిలచాడు. బహుశా కిటికీగుండా లోనిదృశ్యం చూసి వుంటాడు. మంచుముక్కల్లాటి తన చేతుల్తో, నాచెయ్యిపట్టుకుని, తలుపుదగ్గిర కీడ్చుకొని వెళ్ళాడు! అయోమయంగా అనుసరించాను నేను.

కోపంతో, ఉద్రేకంతో, అవమానంతోభడాల్న కాలిబూట్‌తో తలుపుతన్నాడు. వాళ్ళు లేచి వచ్చేలోగా తలుపువిరిగిపడింది. మధు, స్వర్ణ లిద్దరూ ఒకరికౌగిలినుంచి ఒకరు విడిపించుకు స్థంభించిపోయి నిలబడ్డారు? నల్లగా తారు పూసినట్టున్న ఆ ముఖాలు వంగిపోయాయి.

క్లబ్‌లో జనమంతా ఈ అసందర్భ, అనౌచిత సన్నివేశానికి సాక్షిభూతులై నిలబడ్డారు నిర్లజ్జగా .... సంస్కర్త వాసుదేవరావు పేరు ప్రతిష్టలకేనాడూ తగలనంత పెద్ద దెబ్బ తగిలింది యీనాడు.

మరునాడు క్లబ్ వార్షికోత్సవం రంగు రంగుల కాగితాలతో ఎత్తైయినస్టేజ్‌తో దాని మీద మైకా రాక్షసుడితో బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేయబడ్డాయి.

సభ ప్రారంభమయింది.

ముందువరుసల్లో జిల్లాజడ్జీ జీవన్మృతరావూ, ఎం.ఎల్.ఏ. మాలిన్యరావూ, చైర్మన్ శివరావూ, కమీషనర్ కాదంబరీవల్లభుడూ, ఆడిటర్ జనరల్ ఆయోమయమూర్తీ మొదలుగాగల ప్రముఖవర్గమంతా కూచున్నారు! అధ్యక్షులవారు ప్రసంగిస్తున్నారు.

"మన క్లబ్ శతవార్షికోత్సవ సందర్భంలో కలెక్టర్ మధుసూదనరావునీ, శ్రీయుత వాసుదేవరావునీ, ఆయన సతీమణి స్వర్ణలతాదేవి గారినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నాము. మన ఈ వార్షికోత్సవసందర్భంలో వీరు ముగ్గురూ నిర్వహించిన 'సహజపాత్రాభినయం' పోటీలో మొదటి బహుమతి శ్రీమతి స్వర్ణలతగారికీ, రెండు, మూడు బహుమతులు వరుసగా వాసుదేవరావు, మధుసూదనంగార్లకు సమర్పించుకొంటున్నాం. వీరు ముగ్గురి సహజపాత్రాభినయాన్ని కొన్నిరోజులుగా పరిశీలిస్తున్న జిల్లా జడ్జీ జీవన్మృతరావు ఎం.ఎల్.ఏ. మాలిన్యరావూ, సూర్యంగారల ఏకాభిప్రాయంతో ఈ నిర్ణయం జరిగింది."

నేను నిశ్చేష్టుడినైపోయాను. క్లబ్ మెంబర్లంతా కూడా కొయ్యబారిపోయారు ఎవరి కుర్చీలో వాళ్ళు. ఏదో జరగబోతుందనుకోగా, మరోటి జరిగినందుకు నిరాశతో. స్వర్ణలతాదేవి సౌశీల్యాన్ని శంకించిన నాలోని 'డౌటింగ్ కాన్షస్'కి చెప్పుదెబ్బకొట్టింది నా వివేకం.

★ ★ ★

కొన్నిరోజులు గడిచాయి; కలెక్టర్ మధుసూదనానికి మరోజిల్లా బదిలీఅయింది. వాసు క్లబ్‌కి రావడం మానుకున్నాడు. జీవితంలో ఏదో పెద్దదెబ్బతిన్నవాడిలా కృంగిపోసాగాడు దినదినానికీ. 'మానవాభ్యుదయసంఘం' రద్దయిపోయింది. సంఘసేవ, స్నేహబృందం విడిచేసి, ఏకాకైపోయాడు.

"నీలో సంస్కారి ఎలా వున్నాడురా?" అంటే 'ఇంక లేడురా .... వాడప్పుడే చచ్చిపోయాడురా" అంటాడు.

ఒకనాడు వాసుని కలుసుకుందికి వాడి యింటికి వెళ్ళాను. ఒక్కడూవున్నాడు ప్రపంచంలో యావద్విషాదాన్ని పోతపోసిన విగ్రహంలా.

"స్వర్ణ ఏదిరా?" అన్నా కూచుంటూ.

"వాళ్లపూరు వెళ్లిందిరా...." అన్నాడు అయిష్టంగా.

మరి నేనావిషయం యెత్తలేదు. ఎందుకు బాధపడుతున్నాడో, ఎలా ఓదార్చాలో నాకు తెలియదు అయితే ఒకటిమాత్రం నిజం! ఆ తర్వాత నేనుగానీ, ఎవ్వరుకానీ .... వాసు స్వర్ణలు కలిసివుండగా చూడలేదు అంటే అతిశయోక్తిమాత్రంకాదు!

* * *

కొన్ని సంవత్సరాల అనంతరం, పనిమీద మెడ్రాస్ వెళ్లవచ్చిననేను, విశాఖపట్నం ప్లాట్ ఫారంమీద తిరుగుతూవుండగా, కదలబోతున్న మద్రాస్‌మెయిల్ కంపార్ట్‌మెంట్‌లోంచి, తల బైటికిపెట్టి, ఎవరో స్త్రీ ఆకారం నన్ను పిలుస్తోంది!

అటువైపు వెళ్లాను.

ఆశ్చర్యం! ఆమె స్వర్ణలతా వాసుదేవరావు!

"కులాసావా?" అంది నన్నుచూసి.

"ఆ...." అన్నాను ఏం అనాలో తెలీక....

"మేం....మద్రాసు వెళుతున్నాం...." ఆ సహజీవి ఎవరో నాకు తెలియదు .... నేను అడుగనూలేదు. రైలు కదులుతున్నది.... స్వర్ణ చెయ్యూపుతోంది! నేను వెనుకబడి పోతున్నాను. అకస్మాత్తుగా స్వర్ణవున్న పెట్టె కిటికీలోంచి, ఒక తల బైటకు కనిపించింది! అది మధుసూదనరావు!

వివరాలు, విశేషాలూఅడిగి, అటు వాళ్లను ఇటు నన్నుకూడా విషాదసాగరంలో ముంచగల అసహ్యకరఘట్టానికి రూపకల్పన జరిగే అవకాశాలను, అంతంచేస్తూ, జరిపోతులా, జరజరా ప్రాకిపోతున్నది ట్రెయిన్ పట్టాల మీదుగా........?

★

## సిప్లినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు, మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును. 20 పూటలమందు రూ. 3=50 న.పై.

ధనలక్ష్మి అండ్ కో.,
త. పె. నం. 1376, మద్రాసు-1.

